క్లుప్తంగా

ప్రజలకు జవాబుదారీగా విధులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామచంద్ర

తిరుపతి రూరల్ : ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వర్తించాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ రామచంద్ర సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాకు బదిలీపై వచ్చిన ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ముందుగా సచివాలయాల వారీగా ఉద్యోగులు పరస్పరం పరిచయం చేసుకున్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. సున్నితంగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బాధ్యతారహితంగా విధులు నిర్వర్తిస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సక్రమంగా పనిచేయడం లేదని ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు



మెటీరియల్ అందిస్తున్న దాత

తిరుపతి ఎడ్యుకేషన్ : అన్నమయ్య సర్కిల్ సమీపంలోని గ్రేడ్–1 గ్రంథాలయానికి బుధవారం చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లెకు చెందిన దాత డి.వెంకటేశ్వర్లునాయుడు పోటీ పరీక్షల మెటీరియల్‌ను విరాళంగా అందజేశారు. లైబ్రేరియన్ శివప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగుల సౌకర్యార్థం స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్, ఆర్ఆర్‌బీ, ఎండోమెంట్, ఎస్‌బీఐ బ్యాంక్ ప్రొబేషనరీ ఆఫీసర్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించినవి, అలాగే పట్టాభి రామ్ వ్యక్తిత్వ పుస్తకాలను దాత అందజేసినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రుయాలో బీటీ రోడ్ల నిర్మాణం



రోడ్లు నిర్మిస్తున్న దృశ్యం

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో బీటీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తుడా ఈఈ రవీంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రుయా అభివృద్ధి కమిటీ సమావేశంలో బీటీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారని, ఆ మేరకు కలెక్టర్ ఆదేశించినట్లు వెల్లడించారు. పనులను రుయా ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ సైతం పర్యవేక్షిస్తున్నారు.


ఆన్‌లైన్‌లో వసతుల అప్‌లోడ్



మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : మండలంలోని మోడల్ ఎంపీపీ పాఠశాలలకు కావలసిన మౌలిక వసతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంఈఓ బాబ్జీ సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో మోడల్ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడు తూ పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, కావలసిన అదనపు తరగతి గదుల సంఖ్య, ఫ ర్నీచర్, పనుల అంచనా విలువను అప్‌లోడ్ చే యాలని వెల్లడించారు. ఎంఈఓ–2 లింగయ్య, హెచ్‌ఎంలు కుమార్‌రెడ్డి, సుమత్తమ పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లల అప్పగింత



: పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ : రుయా ఆస్పత్రి వద్ద తప్పిపోయిన ఇద్దరు పిల్లలను తల్లిదండ్రులకు వెస్ట్ పోలీసులు అప్పగించారు. వివరాలు.. పాకాలలోని సూరివారిపల్లెలో నివసిస్తున్న చంద్రశేఖర్, సునీత దంపతులకు ప్రభాకర్(7) ఢిల్లీ రాజు(5) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రితో కలిసి ఇరువురూ బుధవారం తిరుపతికి వచ్చారు. చంద్రశేఖర్ సొంత పనులు నిమిత్తం వెళ్లేందుకు రుయా హాస్పిటల్ సమీపంలో ఉన్న బంధువు మురుగన్ వద్ద వదిలిపెట్టారు. అయితే మురుగన్ పట్టించుకోకపోవడంతో పిల్లలు తప్పిపోయారు. స్థానికులు గమనించి పోలీసుల వద్దకు చేర్చారు. పిల్లల ద్వారా తల్లిదండ్రుల ఆచూకీ తెలుసుకున్న పోలీసులు వారిని పిలిపించి అప్పగించారు.

ఆగస్టు 23న సీపీఐ రాష్ట్ర మహాసభలు

తిరుపతి కల్చరల్ : ఒంగోలులో ఆగస్టు 23వ తేదీన సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్.డీ.రవి, గౌరవాధ్యక్షుడు ఎస్.శివ తెలిపారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆటో మెకానిక్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులను కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో దగా చేస్తున్నారని విమర్శించారు. నేతలు మహేంద్రబాబు, లక్ష్మీనారాయణ, నిరంజన్‌కుమార్, జానకిరామ్, ఏ.రవి, సురేష్ పాల్గొన్నారు.

పోరాట వెలుగులు



ధర్నా నిర్వహిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు (ఫైల్)



కాంతులు వెదజల్లుతున్న సెంటర్‌లైట్లు

మంగళం నుంచి కరకంబాడి వరకు రహదారిపై ఏర్పాటు చేసిన సెంటర్‌లైట్లను ఎట్టకేలకు వెలిగాయి. ఈ దీపాలు ఏర్పాటు చేసి ఏడాది గడిచినా.. చంద్రబాబు వచ్చినప్పుడు మినహా కాంతులు పంచేవి కాదు. దీంతో ఈ మార్గంలో రాత్రివేళ రాకపోకలు సాగించేవారు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగేవి. ఈ క్రమంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి దృష్టికి ఈ సమస్య వచ్చింది. ఆయన వెంటనే స్పందించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళనకు దిగడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఆగమేఘాల మీద సెంట్రల్ లైట్లు వెలిగించేందుకు చర్యలు చేపట్టింది. అభినయ్‌రెడ్డి పోరాటంతోనే తమ ప్రాంతానికి వెలుగు వచ్చిందని మంగళంవాసులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. – తిరుపతి మంగళం

ఇటు చెత్త అటు బురద





తిరుపతిలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఒక వైపు చెత్తా చెదారాలు.. మరో వైపు బురదమయంగా మారింది. ఇందుకు 43వ డివిజన్‌లోని సప్తగిరినగర్ రహదారులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అండ్‌గ్రౌండ్ డ్రైనేజీ.. వాటర్ పైప్‌లైన్‌కోసం తవ్వేసిన రోడ్లను అలాగే వదిలేయడంతో గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు నగరవాసులు నానా అవస్థలు పడుతున్నారు. కార్పొరేషన్ నిర్లక్ష్య వైఖరిపై మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దెబ్బతిన్న రహదారులకు కనీసం మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

లాఠీ మీద సాము!



ఖాకీ పేరు వింటేనే నేరగాళ్లకు హడల్.. తప్పు చేసిన వారికి గుండె గుభేల్.. పోలీస్ సైరన్ వినబడితే రౌడీలు పరార్.. అయితే చంద్రగిరిలో మాత్రం కూటమి నేతల పేరు చెబితే పోలీసులే హడలిపోతున్నారు. ఇక్కడి స్టేషన్‌లో పోస్టింగ్ అంటే మాకొద్దు బాబోయ్ అంటూ చేతులెత్తేస్తున్నారు. అధికార పార్టీతో అంటకాగకుంటే శంకరగిరి మాన్యాలు పట్టాల్సిందే అంటూ ఆరోపిస్తున్నారు. సక్రమంగా పనిచేసుకోవాలంటే పచ్చమూకకు జీహుజూర్ అనాల్సిందే అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అణిగి ఉంటేనే పెద్దల అభయం దక్కుతుందని వాపోతున్నారు. నిజాయితీగా విధులు నిర్వర్తిస్తే వేటు తప్పదని ఆందోళన చెందుతున్నారు.

- చంద్రగిరిలో పోస్టింగ్ అంటేనే హడలిపోతున్న పోలీసులు
- జీ హుజూర్ అనాల్సిందే అంటున్న కూటమి నేతలు
- రాజకీయ ఒత్తిడిని తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న ఖాకీలు
- ఇప్పటికే ఖాళీగా పలు పోస్టులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి కూతవేటు దూరంలోని చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో పోస్టింగ్ అంటే పోలీసులు వెనుకంజ వేస్తున్నారు. ఇక్కడ నీతి, నిజాయితీకన్నా ముందు అధికార పార్టీ నేతల ఆశీర్వాదమే ముఖ్యం. వారి అభయం ఉంటే ఎన్నేళ్లయినా ఎంచక్కా రూల్స్‌ను పక్కనపెట్టి మరీ ఇక్కడ పనిచేయవచ్చు. కూటమి నేతల ఆగ్రహానికి గురైతే మాత్రం ఎక్కడికి పంపిస్తారో కూడా ఊహించని పరిస్థితి.

కష్టతరంగా విధులు

చంద్రగిరి పోలీసు స్టేషన్ పరిధిలో పూతలపట్టు–నాయుడుపేట, తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారులు ఉన్నాయి. అలాగే అత్యంత ప్రమాదకరమైన భాకరాపేట కనుమ కూడా ఉంది. జాతీయ రహదారిపై ప్రతి నెలా సుమారు 10కి పైగా ప్రమాదాలు జరుగుతుంటాయి. దీంతో పోలీసులు రాత్రింబవళ్లు తేడా లేకుండా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. అలాగే చంద్రగిరి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయి వ్యాపారం చాప కింద నీరులా విస్తరిస్తోంది. యువత మత్తుకు అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్నారు. తరచూ ఘర్షణలకు దిగుతున్నారు. అలాగే చోరీలు సైతం విపరీతంగా పెరిగిపోయాయి. ఈ క్రమంలో చంద్రగిరి పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

చెప్పినట్టు వినకుంటే వేటే!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు తమకు అనుకూలమైన వారికి చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో పోస్టింగ్‌లు ఇప్పించారు. అందులో ఓ అధికారి ప్రతిపక్ష నేతలపై కేసులను నమోదు చేసి తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. అయితే ఇటీవల కూటమి నేతలతో విభేదాలు తలెత్తడంతో సదరు అధికారిని తిరుపతి ట్రాన్స్‌ఫర్ చేయించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. అదే విధంగా ఓ మహిళా అధికారి మాట వినలేదని ట్రాన్స్‌ఫర్ చేయించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల ఓ ఉద్యోగిని సైతం ఇదే కారణంతో వీఆర్‌కు పంపినట్లు పలువురు పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు పోయినా తాము చెప్పినట్లే ఇక్కడ పనిచేయాలంటూ కూటమి నేతలు బెదిరింపులకు దిగుతుండడంతో చంద్రగిరి స్టేషన్‌లో పోస్టింగ్ అంటేనే పోలీసులు భయాందోళన గురవుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

మరోవైపు చంద్రగిరి పోలీసు స్టేషన్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇప్పటికీ సీఐ, ఎస్ఐ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. డీఎస్పీ నుంచి కానిస్టేబుల్ వరకు 60 మంది ఉండాల్సిన చోట కేవలం 28 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా పనిభారంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఔట్‌పోస్టులు మూతపడ్డాయి. పోలీసు స్టేషన్‌లో కేవలం ఒక్క మహిళా ఏఎస్ఐ మాత్రమే ఉంది. రాత్రివేళల్లో గస్తీ కూడా అంతంతమాత్రంగానే ఉందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా పోలీసు అధికారులు స్పందించిన చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌పై రాజకీయ ఒత్తిడి లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీకోదండరామాలయంలో ఉదయం 7 గంటలకు సహస్ర కలశాభిషేకం, 11 గంటలకు సీతాముల కల్యాణం, రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ.
- తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శనం టికెట్ల కోటా ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ ద్వారా విడుదల.
- అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక పోటీలలో భాగంగా మహతిలో ఉదయం 9.30 నుంచి నృత్య, నాటక ప్రదర్శనలు.

నాయీబ్రాహ్మణ సంఘానికి కొత్త కమిటీ



మాట్లాడుతున్న జబ్యాల సుధాకర్

తిరుపతి కల్చరల్ : నాయీబ్రాహ్మణ సేవా సంఘం నగర నూతన కమిటీని ఎన్నికున్నట్లు ఏపీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కన్వీనర్ జబ్యాల సుధాకర్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. యూత్‌హాస్టల్లో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు తొలి సారిగా బ్యాలెట్ పేపర్ ద్వారా కమిటీని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. సంఘం నూతన అధ్యక్షుడు ఎస్.జయకుమార్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి అందరూ సహకారం అందించాలని కోరారు.

'కందారపు' కుటుంబానికి పరామర్శ



రాజమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భూమన



ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న భూమన

తిరుపతి మంగళం : సీపీఎం నేత కందారపు మురళి మాతృమూర్తి కందారపు రాజమ్మ సంతాప సభను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి హాజరయ్యారు. రాజమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కందారపు కుటుంబీకులను పరామర్శించారు. ఈ క్రమంలోనే టీటీడీ విశ్రాంత డీఈఓ రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రభావతమ్మ శుభస్వీకరణకు హాజరై ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అలాగే ఇరికి ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి రామాబాయి సంతాపసభలో భూమన పాల్గొన్నారు.

నీటి వృథా నివారణకు చర్యలు



తాగునీటి కొళాయిని పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో సరఫరా చేసే తాగునీరు వృథా కాకుండా నివారించేందుకు చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. బుధవారం ఉదయం 45వ వార్డులో కార్పొరేటర్ అనీష్, అధికారులతో కలిసి పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పలుచోట్ల తాగునీరు వృథాగా పోతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు వెంటనే తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. తాగునీటిలో మురుగు నీరు కలవకుండా పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని శానిటరీ సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఈ క్రమంలోనే కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్ అవసరం



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్

తిరుపతి అర్బన్: జిల్లాలోని ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్ డీవీజీ శంకర్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో గిరిజన సంక్షేమం, అభివృద్ధికి తీసుకున్న చర్యలపై ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో గిరిజనులు ఎక్కువ శాతం మైదాన ప్రాంతాల్లో అక్కడక్కడ నివసిస్తుంటారని, వారు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారని, వారి సమస్యలను నేరుగా చెప్పుకోలేని పరిస్థితిలో ఉంటారని తెలిపారు. అధికార యంత్రాంగమే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. విద్య, వైద్యంపై వారికి అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓతో పాటు పలు శాఖాధికారులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మీ వైభోగ వ్రతం రేపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : శ్రీవారి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు రామచంద్ర పుష్కరిణి ఆవరణలో అష్టలక్ష్మీ వైభోగ వ్రతం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి గీతాంజలి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఈ మేరకు ఆహ్వాన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా హిందూ ధర్మ పరిషత్ అధ్యక్షుడు సత్యనారాయణ స్వామిజీ ఆధ్వర్యంలో 600 మహిళలతో వ్రతం ఆచరించనున్నట్లు వెల్లడించారు. ప్రసన్న లక్ష్మి, వసుంధర, చంద్రమౌళి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ లోకనాథం

పాకాల : మండలంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీపీ లోకనాథం ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల మీట్ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ తోటపల్లె, మణిపిరెడ్డిపల్లె దళితవాడలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం విడనాడాలని కోరారు. భూ భాగ పరిష్కారం కోసం మూడు నెలల క్రితం వినతిపత్రం అందించినా రెవెన్యూ అధికారులు ఇప్పటికీ స్పందించలేదని మండిపడ్డారు. తన సొంత సమస్యనే పట్టించుకోకపోతే ఇక ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మండల మీట్‌కు హాజరుకాని వారికి వెంటనే మెమో జారీ చేయాలని ఎంపీడీఓ శశిరేఖను ఆదేశించారు. అనంతరం పలువురు అధికారులు అభివృద్ధిపై నివేదికలు సమర్పించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి పాల్గొన్నారు.

అధికారుల అలసత్వం

మండలమీట్‌కు హాజరైన ప్రజా ప్రతినిధులకు కనీసం భోజన వసతి కూడా కల్పించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో భోజనాలు ఏర్పాటు చేసేవారని పలువురు ప్రజా ప్రతినిధులు గుర్తుచేసుకున్నారు. దీనిపై ఎంపీపీని వివరణ కోరగా నిధుల లేమి కారణంగా ఆహారం అందించలేకపోయినట్లు వెల్లడించారు.

'బర్డ్' నిర్వహణపై సమీక్ష

తిరుపతి తుడా: పద్మావతి అతిథిగృహంలో బర్డ్ ఆస్పత్రి నిర్వహణపై బుధవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు సమీక్షించారు. చైర్మన్ మాట్లాడుతూ రైతులు, పేదలకు అధిక ప్రాధాన్యంతో వైద్యసేవలందించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో సర్జరీ కోసం ఎక్కువ వెయిటింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది, మందులు, పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మోకీలు మార్పిడి, తదితర శస్త్ర చికిత్సలకు ఉపయోగించే విదేశీ పరికరాలను మరింత నాణ్యంగా ఉండే వాటిని సేకరించాలని సూచించారు. బర్డ్ డైరెక్టర్ జగదీష్, బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, జానకీదేవి, అదిత్ దేశాయ్, జేఈఓ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీటీడీ ఉద్యోగికి గాయాలు

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో టీటీడీ ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని తొండవాడ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చంద్రగిరి పాతపేటకు చెందిన రాజశేఖర్ టీటీడీ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో గ్రేడ్–4 ఉద్యోగికి విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తున్నాడు. మండలంలోని తొండవాడ సమీపంలోని సాయిబాబ మందిరం వద్ద వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది, వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు.

ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక



తేజ, కార్యదర్శి



సిద్ధార్థ్, అధ్యక్షుడు

తిరుపతి కల్చరల్ : ఎస్ఎఫ్ఐ నగర నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేశారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నగర కమిటీ సమావేశంలో అధ్యక్షుడిగా సిద్ధార్థ్, కార్యదర్శిగా తేజ నియమితులయ్యారు. వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి తిరుపతిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నవరస భరితం.. నాటకోత్సవం



కళాకారుల నృత్యప్రదర్శన

తిరుపతి కల్చరల్ : అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక పోటీలలో భాగంగా మహతి కళాక్షేత్రంలో బుధవారం ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద బృంద నృత్యాభినయాలు, పౌరాణిక, సాంఘిక నాటికలు నవరస భరితంగా సాగాయి. శ్రీమిర్యాలగూడ సాంస్కృతిక కళాక్షేత్రం వారు ప్రదర్శించిన 'బ్రహ్మరథం' పౌరాణిక పద్యనాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'రాత' సాంఘిక నాటిక చైతన్యవంతంగా సాగింది. అనంతరం కళాకారులను అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్.రెడ్డి, ప్రతినిధులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

తిరుపతి క్రైం: ఓ మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి చైన్ లాక్కుని పరారవుతుండగా ప్రజలు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన బుధవారం జరిగింది. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. తిరుపతి నగరంలోని కోటకొమ్మల వీధిలో నివాసముంటున్న కమలమ్మ సొంత పనులు నిమిత్తం అదే వీధిలో తిరుగుతుండగా ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి, ఆమె మెడలోని చైన్ లాక్ వెళ్లే ప్రయత్నం చేశాడు. వెంటనే గుర్తించిన స్థానికులు అప్రమత్తమై ఆ వ్యక్తిని పట్టుకుని చెట్టుకు కట్టి దేహశుద్ధి చేశారు. వెంటనే ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించి, వారికి అప్పగించారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్పాహారం వితరణ



టిఫిన్ వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద గర్భిణులు, సహాయకులకు అల్పాహారం వితరణ చేశారు. క్లబ్ రీజనల్ చైర్మన్ ఎం.భాస్కర్, కార్యదర్శి సి.చక్రపాణి, ఉపాధ్యక్షుడు జి.శంకర్, కోశాధికారి వి.పురుషోత్తమనాయుడు, సభ్యు లు రామచంద్రారెడ్డి, రామారావు, మురళి, శంకర్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో భవన నిర్మాణాల పరిశీలన



ఆస్పత్రి ఆవరణలో కట్టడాలను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్, ఈఓ తదితరులు

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రిలో చేపట్టిన నిర్మాణాల పనులను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించారు. టీటీడీ ఈవో శ్యామలరావు, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్‌తో కలిసి బుధవారం కార్డియాక్ న్యూరో సైన్సెస్, స్విమ్స్ పాత భవనం, స్టాఫ్ క్వార్టర్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులు మరింత నాణ్యంగా చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న పనులు, డిజైన్లు తదితర అంశాలను సకాలంలో పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్విమ్స్ పరిపాలనా భవనంలో డైరెక్టర్, టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు అభివృద్ధి పనుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చైర్మన్‌కు వివరించారు.